క్లుప్తంగా

అభినందన

కడప స్పోర్ట్స్ : తిరుపతి నగరంలో ఈనెల 1 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించిన ఏపీ సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో హ్యాండ్‌బాల్ పురుషుల జట్టు రెండోస్థానంలో నిలిచి రన్నర ప్‌గా నిలిచింది. ఈ నేపథ్యంలో జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ గురువారం కడప నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో క్రీడాకారులను అభినందించింది. వైఎస్ఆర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు చిన్నపరెడ్డి, జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ శివప్రసాద్, కోచ్ అబ్దుల్ మునాఫ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

కళలతో సంస్కారం అలవడుతుంది

కడప కల్చరల్ : విద్యార్థి దశలో కళలను అభ్యసించిన వారికి సంస్కారం అలవలడుతుందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు ఏడీ దేవదత్తం పిల్లలకు తెలిపారు. కడప నగరం రవీంద్రనగర్‌లోని సంస్థ కార్యాలయంలో పది రోజులుగా బాలల కోసం వేసవి శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన గురువారం జరిగిన కార్యక్రమంలో సంగీతం గురించి వివరించారు. పాడుదామా స్వేచ్ఛా గీతం అనే గీతాన్ని వివరించి పాడించారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, నగర కార్యదర్శి మధు, ఇతర శిక్షకులు చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

16న ఉచిత వడుగులు

కడప కల్చరల్ : కడప నగరం నకాష్‌లోని మదరసా–యే– మహమ్మదియాలో ఈనెల 16న ముస్లిం బాలురకు ఖత్నా (వడుగులు) కార్యక్రమాన్ని బగ్దాదియా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఉదయం 9.00 గంటలకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఇందుకోసం ఈనెల 15వ తేది వరకు ఖత్నా చేయించుకోదలిచిన వారి పేర్లు నమోదు చేయించాలని తెలిపారు. ఇతర వివరాలకు 94409 72157 లేదా 81799 64148 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

29న కలెక్టరేట్ ఎదుట ధర్నా

కడప వైఎస్ఆర్ సర్కిల్ : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టాన్ని కాపాడుకునేందుకు ఈ నెల 29న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్ పేర్కొన్నారు. ఈ విషయమై గురువారం ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు రెండు పూటల పనిని రద్దు చేయాలన్నారు. సమ్మర్ అలవెన్స్ కింద 40 శాతం ఇచ్చి వంద రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలకు అదనంగా పనిని కల్పించాలన్నారు. ఈ సమస్యలపై చేస్తున్న ధర్నాను ఉపాధి హామీ కూలీలు జయప్రదం చేయాలని కోరారు.

క్రీడలతో మానసిక, శారీరక ఉత్సాహం

కడప స్పోర్ట్స్ : క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక ఉత్సాహం కలుగుతుందని కడప నగర మేయర్ కె. సురేష్‌బాబు పేర్కొన్నారు. గురువారం కడప నగరం పక్కీరుపల్లెలో శశి, విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన పి.వి.ఆర్. బ్యాడ్మింటన్ ఎరేనాను ఏపీఎస్ఆర్‌టీసీ చైర్మన్ ఎ. మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కడప నగరంలో ఇప్పటి వరకు శాప్ ఆధీనంలోని ఇండోర్ స్టేడియం మాత్రమే ఉండగా, క్రీడాకారుల సౌకర్యార్థం ప్రైవేట్ రంగంలో సైతం ఇండోర్ స్టేడియం అందుబాటులోకి రావడం సంతోషంగా ఉందన్నారు. పి.వి.ఆర్. బ్యాడ్మింటన్ ఎరేనా నిర్వాహకులు శశి, విశ్వనాథరెడ్డి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రేరణ మెటీరియల్‌తో ఉత్తమ ఫలితాలు


అత్యధిక మార్కులు సాధించిన నగరపాలక మెయిన్ పాఠశాల విద్యార్థులను అభినందిస్తున్న నగరపాలక కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్

కడప ఎడ్యుకేషన్ : నగరపాలక పరిధిలో 10వ తరగతి విద్యార్థుల కోసం సబ్జెక్టు నిపుణులతో తయారు చేసిన ప్రేరణ మెటీరియల్ బుక్‌తోనే ఉత్తమ ఫలితాలను సాధించారని నగరపాలక కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ అన్నారు. గురువారం కడపలోని వైఎస్సార్ ఆడిటోరియంలో కడప ఎంఈఓ పాలెం నారాయణ, హెచ్ఎం నాగమణి ఆధ్వర్యంలో 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన నగరపాలక ఉన్నత పాఠశాల మెయిన్ విద్యార్థులను కమిషనర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం చివరిలో విద్యార్థులకు అన్ని సబ్జెక్టులకు సంబంధించిన నిపుణులతో ప్రేరణ మెటీరియల్ పుస్తకాన్ని తయారు చేసి నగరపాలక పరిధిలోని ప్రతి పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు అందించామన్నారు. నగరపాలక మెయిన్ పాఠశాలకు సంబంధించి ఉజ్వల 578, ధనుష్ 575లతోపాటు మరో 20 మంది 500పైగా మార్కులు సాధించారని హెచ్ఎం నాగమణి కమిషనర్‌కు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి, సీఆర్‌పీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాలుకా పోలీసులపై ఎన్‌హెచ్ఆర్సీకి ఫిర్యాదు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : సీపీఐ, సీపీఎం నాయకులపై అక్రమ అరెస్టులను నిరసిస్తూ ఎన్‌హెచ్ఆర్సీకి ఫిర్యాదు చేసినట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత నెల 29న సీపీఐ, సీపీఎం చేపట్టిన ప్రచార భేరీ కార్యక్రమంలో భాగంగా కడప తాలుకా సీఐ ఉలసయ్య, ఎస్ రామకృష్ణ, తాహిర్ హుస్సేన్ ఉద్యమకారులను కొట్టి కులం పేరుతో దూషించి అక్రమ కేసులు పెట్టడంపై కలెక్టర్, ఎస్పీ, డీఎస్పీ, డీజీపిలకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. తాలుకా పోలీసుల తీరుపై ఎన్‌హెచ్ఆర్సీకి ఫిర్యాదు చేశామన్నారు. త్వరలో ప్రైవేట్ కేసు వేస్తామన్నారు.జిల్లాలో భూ మాఫియా, ఇసుక, గంజాయి, ఎర్ర చందనం, మట్కా, గ్యాబ్లింగ్ రెచ్చిపోతుంటే అరికట్టాల్సిన పోలీసులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. సీపీఐ నాయకులు చంద్రశేఖర్, కెసీ బాదుల్లా, మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు

ఇనుప కమ్మీలకు మరమ్మతులు చేపట్టాలి


రిమ్స్ వెళ్లే దారిలో చెర్లోపల్లె రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద దెబ్బతిన్న రైల్వే ఇనుప కమ్మీలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగర శివార్లలోని రిమ్స్ ఆసుపత్రికి వెళ్లే ప్రధాన రహదారిలోని చెర్లోపల్లి రైల్వే వంతెనకు ఏర్పాటు చేసిన ఇనుప కమ్మీలకు మరమ్మతులు చేపట్టాలని స్థానిక ప్రజలు, వాహనాదారులు కోరుతున్నారు. రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన ఇనుప కమ్మీలు గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో కమ్మీలు దెబ్బతిని కిందకు ఒరిగాయన్నారు. నిత్యం ఈ రహదారి గుండా 24 గంటలు రాకపోకలు సాగిస్తుంటారు. రైల్వే అండర్ బ్రిడ్జికి భారీ వాహనాలు వెళ్లకుండా రైల్వే అధికారులు ఏర్పాటు చేసిన ఇనుప కమ్మీలు ఎక్కడ కూలి ప్రజలపై పడతాయోనని వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు.

ఈ రహదారిలో ప్రయాణించొద్దు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రిమ్స్‌కు వెళ్లే చెర్లోపల్లె అండర్ బ్రిడ్జికి ఏర్పాటు చేసిన రైల్వే కమ్మీలు దెబ్బతిన్నాయని ఆ రహదారి గుండా వాహనదారులు వెళ్ళరాదని ఆర్‌సీపీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు మడగలం ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం చెర్లోపల్లె రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి వాహనాదారులు వెళ్ళకుండా ప్లకార్డులతో వాహనాదారులకు సూచించారు. ఆర్‌సీపీ నాయకులు రవి, మేరీ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వేదిక 'జగనన్నకు చెబుదాం'


మాట్లాడుతున్న అఫ్జల్‌ఖాన్

కడప కార్పొరేషన్ : ప్రజలు తమ సమస్యలను నేరుగా ముఖ్యమంత్రికి తెలిపి పరిష్కరించుకోవడానికి జగనన్నకు చెబుదాం మంచి వేదిక అవుతుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్ అన్నారు. 'యువగళం' పేరుతో లోకేష్ చేస్తున్న పాదయాత్ర పెద్ద డ్రామాలా మారిందని ఆయన విమర్శించారు. గురువారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ బాబుకు ప్రజా సమస్యలు పరిష్కారం కావడం ఇష్టం లేదన్నారు. దానిపై కూడా వారు విమర్శలు చేస్తున్నారని, ప్రజలు తమ సమస్యలు చెప్పుకోవడానికి వీల్లేకుండా అడ్డుపడుతున్నారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొనసాగించడం లేదని టీడీపీ నేతలు విమర్శించడం హాస్యాస్పదమన్నారు. అసలు టీడీపీ ప్రభుత్వంలో ప్రజలకు ఉపయోగపడే ఒక్క పథకమైనా చేపట్టారా అని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్‌కు రైతు సమస్యలపై అవగాహన లేదని, ఆయన ఫుల్‌టైం రాజకీయ నాయకుడు కాదని విమర్శించారు. షూటింగ్ లేని సమయాల్లో ఆయన సభలు పెట్టి ప్రభుత్వంపై విమర్శలు చేస్తుంటారని ఎద్దేవా చేశారు.

క్రీడాకారులకు హాకీ స్టిక్స్ పంపిణీ


హాకీ స్టిక్స్ అందజేస్తున్న సుభాన్‌బాషా, సీనియర్ క్రీడాకారులు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా నిర్వహిస్తున్న హాకీ శిక్షణ శిబిరంలోని క్రీడాకారులకు ధ్యాన్‌చంద్ హాకీ అకాడమీ డైరెక్టర్ ఎస్. సుభాన్‌బాషా హాకీ స్టిక్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీనియర్ క్రీడాకారులు కీర్తి, సందీప్‌రాజ్, శౌరి, కోచ్ కల్యాణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

చింతకొమ్మదిన్నె : నగర పరిధిలోని 18వ డివిజన్ సాయినగర్, విశ్వనాథపురం గ్రామాల్లో శుక్రవారం జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటారని మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని సీఎస్ఐ క్రీడా ప్రాంగణంలో ఏప్రిల్ 27వ తేదీన జరిగిన కందుల నాని ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్టుకు కేఎస్ఆర్ఎం కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబులరెడ్డి బహుమతులను ప్రదానం చేశారు. ఈ లీగ్ పోటీల్లో రాజేష్ –11 జట్టు, కొండా –11 జట్ల మధ్య హోరాహోరీగా జరిగిన పోటీల్లో కొండా–11 జట్టు విజేతగా నిలిచింది. విజేతగా నిలిచిన కొండా–11 జట్టుకు లక్ష రుపాయల, ట్రోఫీని కందుల నాని అందచేశారు. రన్నర్‌గా నిలిచిన రాజేష్ లెవెన్ జట్టుకు 50 వేల రూపాయలు, ట్రోఫీని ఏఎంఆర్ కనస్ట్రక్షన్ అధినేత రోహిత అందచేశారు. అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్, ఆర్గనైజర్ గిఫ్టీపాల్, రెన్నీ పాల్గొన్నారు.

లైంగిక వేధింపులు దారుణం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రెజ్లింగ్ క్రీడాకారులపై బీజేపీ ఎంపి లైంగిక వేధింపులకు పాల్పడటం దారుణమని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి ఓబులేసు పేర్కొన్నారు. గురువారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజు భూషణ్ అరెస్ట్ చేయాలని దేశ రాజధానిలో ఆందోళన చేస్తే వారిపై దాడులు చేయడం దారుణమన్నారు. డీవైఎఫ్ఐ నాయకులు నాగార్జున, విజయ్ పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీలు

చింతకొమ్మదిన్నె : స్థానిక గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్‌లో భాగంగా గురువారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను గ్రంథాలయ అధికారి ఇబ్రహీం నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేస్తామన్నారు.

అసత్య ఆరోపణలు చేయడం తగదు

కమలాపురం : కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌పై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అసత్య ఆరోపణలు చేయడం తగదని మైనార్టీ కమిషన్ బోర్డు మెంబర్ హిదాయత్ పేర్కొన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 7వ తేదీన కర్నూలులో జరిగిన కార్యక్రమంలో నారా లోకేష్, కర్నూలు నగర ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌పై వక్ఫ్ భూముల్లో అక్రమాలు చేశారని అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. ఇప్పటికే ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా లోకేష్‌పై చర్యలు తీసుకోవాలని మా కమిషన్ చైర్మన్ కె.ఇక్బాల్‌అహ్మద్‌ఖాన్‌కు ఫిర్యాదు చేశారన్నారు.

చిత్రాల లోకంలో చిన్నారులు


చిన్నారికి మెళకువలు నేర్పుతున్న శిక్షకుడు

కడప కల్చరల్ : స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న శిక్షణలో భాగంగా గురువారం చిన్నారులకు రంగుల చిత్రాలు వేయడం నేర్పించారు. జన విజ్ఞాన వేదిక సౌజన్యంతో జరుగుతున్న శిక్షణలో చిత్రకళా ఉపాధ్యాయులు చంద్రశేఖర్ చిన్నారులకు రంగుల చిత్రాలు వేయడం నేర్పారు. ఈ సందర్భంగా ఆయన రంగులు, వాటి ప్రభావం గురించి వివరించారు. ఎలాంటి గీతనైన ముచ్చటగొలిపే చిత్రంగా మార్చడం గురించి స్వయంగా గీసి మరీ వివరించారు. అనంతరం క్రాఫ్ట్ శిక్షకులు రంగనాయకులు వృథా వస్తువులను ఇంటిలో ప్రదర్శించుకోగలిగే ఆకర్షణీయమైన బొమ్మలు, వస్తువులుగా రూపొందించడం నేర్పారు. ప్రధాన అంశమైన కథా సమయంలో భాగంగా బుద్ధుని జాతక కథలను శిక్షకులు చదివి వినిపించారు. డిప్యూటీ లైబ్రేరియన్ పవన్‌కుమార్, లైబ్రేరియన్లు సుబ్రమణ్యం, నవాజ్‌జాన్, జేమ్స్, సిబ్బంది రాంప్రసాద్, సుబ్బమ్మ, హరికృష్ణ, నాగలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎస్ ప్లానర్స్ అండ్ కన్‌స్ట్రక్షన్‌తో మనూ ఎంఓయూ


కంపెనీ ప్రతినిధులతో ఒప్పంద పత్రాలను అందుకుంటున్న ప్రిన్సిపాల్ ముఖ్సిత్‌ఖాన్

కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివార్లలోని మనూ పాలిటెక్నిక్ కళాశాల కడపలోని సీఎస్ ప్లానర్స్ అండ్ కన్‌స్ట్రక్షన్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీతో ఎంఓయూ కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ ముఖ్సిత్‌ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులతో ఒప్పంద పత్రాలను ఇచ్చిపుచ్చుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రికల్, సివిల్స్ విద్యార్థులకు ట్రెనింగ్ ప్రాజెక్టు వర్కుతోపాటు ఉపాధి అవకాశాల ఉంటాయన్నారు. సీఎస్ ప్లానర్స్ అండ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సిఎస్ మొహమ్మద్ హాఫిజ్, కళాశాల ఎంఓయూ కో ఆర్డినేటర్ హాకీముద్దీన్, మొహమ్మద్ సికిందర్, మోహమ్మద్ హాపీజ్ పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

కమలాపురం : పట్టణంలోని పడమట వీధి సమీపంలోని చెరువుగట్టుపై వెలసిన వజ్రాల (వరాల) సుంకులమ్మతల్లి అష్టమ బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 12వ తేదీ ఉదయం మహా గణపతి పూజ, స్వస్తి పుణ్యావచనము, పంచగవ్య ఆరాధన, ప్రధాన కలశస్థాపన, సుంకులమ్మదేవత పంచామృత అభిషేకములు నిర్వహించనున్నారు. 13వ తేదీన ప్రాతఃకాల పూజలు, అవాహిత హోమాలు, 14న కుష్మాండబలి, పూర్ణాహుతి, కళ్యాణ మహా మంగళ తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించనున్నారు.

13, 14 తేదీలలో బండలాగుడు పోటీలు

శ్రీ వరాల సుంకులమ్మ తిరునాల సందర్భంగా ఈనెల 13వ తేదీన ఆరుపళ్ల విభాగం ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. గెలుపొందిన విజేతలకు వరుసగా రూ.50వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు నగదు బహుమతులు అందజేయనున్నారు. అలాగే 14వ తేదీన సీనియర్స్ విభాగం ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. వరుసగా రూ.1.5 లక్షలు, రూ.1 లక్ష, రూ.75 వేలు, రూ.50 వేలు, రూ.25వేలు, రూ.15 వేలు నగదు బహుమతులు ఇవ్వనున్నారు. అలాగే 22వ తేదీన న్యూ కేటగిరి ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తారన్నారు. విజేతలకు వరుసగా రూ.75వేలు, రూ.50వేలు, రూ.25వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ,5వేలు ఇవ్వనున్నారు. అలాగే శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి ముగ్గుల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

స్థానికత ఉనికిని తెలిపే మాండలికం


పుస్తకావిష్కరణలో అతిథులు

కడప కల్చరల్ : మాండలికంతో స్థానికత ఉనికితో పాటు భాషకు పరిపుష్టత లభిస్తుందని.. రచయిత గజేంద్రనాథ్‌రెడ్డి బద్వేలు ప్రాంత మాండలికంతో రాసిన కథలు తెలుగుభాష ఉన్నతిని తెలిపేలా ఉన్నాయని వక్తలు పేర్కొన్నారు. హైదరాబాదుకు చెందిన లలిత కళాభిరామ ఫింఛము సంస్థ, స్థానిక రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ సౌజన్యంతో గురువారం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఎలిచర్ల గజేంద్రనాథ్‌రెడ్డి రచించిన 'నాసీమ యాసే నా శ్వాస' కథా సంపుటి పరిచయ సభ జరిగింది. ముందుగా అతిథులు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఇంటాక్ జిల్లా కన్వీనర్ చిన్నపరెడ్డి, సభాధ్యక్షులు మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ మాతృభాష అమ్మలాంటిదన్నారు. భాషా పుష్టిగల గజేంద్రనాథ్‌రెడ్డి తన రచనలో భాషతోపాటు భావ పరిణితిని సాధించారన్నారు. విశిష్ట అతిథి డాక్టర్ ఎలిచర్ల శివానందలహరిరెడ్డి, ఆత్మీయ అతిథి వివేక్ లంకమల మాట్లాడుతూ గజేంద్ర తన అనుభవాలకు మాండలిక పరిమళం అద్ది రచనలో తన ప్రత్యేకతను చాటుకున్నారన్నారు. వైవీయూ చిత్రకళావిభాగం అధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు, గౌరవ అతిథి, రాష్ట్ర అధికారభాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య మాట్లాడారు. అనంతరం కళారత్న, శిల్పి గొల్లపల్లి జయన్న ఆధ్వర్యంలో 'నాసీమ యాస' పుస్తక సమీక్ష నిర్వహించారు. మరాత రత్న ఎంకేబీఎస్ఆర్ సాగర్ పర్యవేక్షణలో కళా, సాహిత్య పర్యాటక రంగాల్లో విశేష కృషి చేస్తున్న పలువురికి లలిత కళాభిరామ పింఛము పురస్కారాలను అందజేశారు.

చిన్నారులకు 'సంపూర్ణ పోషణ'

- సత్ఫలితాలు ఇస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం
- చిన్నారులు, గర్భిణుల, బాలింతలలో రక్తహీనత నివారణ


లబ్ధిదారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం సత్ఫలితాలను ఇస్తోంది. పేదరికంతో ఉన్న గర్భిణీలు సరైన పౌష్టికాహారం తీసుకోకపోవడంతో అనేకమంది రక్తహీనత బారిన పడేవారు. ఈ నేపథ్యంలో రెండేళ్ల కిందట వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలులోకి తీసుకు వచ్చారు. గర్భిణీలకు గతంలో ఇచ్చే పప్పు, పాలు, గుడ్లకు అదనంగా మరో ఆరు రకాల పోషక పదార్థాలను అందించడంతో వారిలో రక్తహీనత తగ్గుతోంది. ఈ పథకంలో గర్భిణీగా నమోదైనప్పటి నుంచి ప్రసవానంతరం ఆరు నెలలపాటు ఆరురకాల పౌష్టికాహార కిట్టును అందిస్తున్నారు. వీటితోపాటు పోషక విలువలతోకూడిన భోజనాన్ని మధ్యాహ్నం అందిస్తున్నారు. భోజనానికి రాని వారికి రోజూ కోడి గుడ్లు, వారానికి లీటరుపాలు సరఫరా చేస్తున్నారు. కడప అర్బన్ ప్రాజెక్టు పరిధిలో గర్భిణులు 1910, బాలింతలు 1725, ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు 11,274 మంది, మూడు నుంచి ఐదేళ్లలోపు చిన్నారులు 3002 మంది లబ్ధి పొందుతున్నారు.

గర్భిణీలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ

గర్భిణీలు, బాలింతలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తోంది. కిలో రాగిపిండి, కిలో అటుకులు, పావుకిలో వేరుశనగ చిక్కీలు, కిలో జొన్నపిండి, పావుకిలో బెల్లం, పావుకిలో ఎండు ఖర్జూరం, మూడు కిలోల పోర్టిఫైడ్ రైస్, అర కిలో నూనె, అరకిలో పప్పు, ఐదు లీటర్ల పాలు, 25 కోడిగుడ్లతో కూడిన కిట్లను అందజేస్తున్నారు.

చిన్నారుల ఆరోగ్యం కోసం

ఆరు నెలల నుంచి మూడేళ్ల వయస్సుగల చిన్నారులకు నెలకు రెండున్నర కిలోల బాలామృతం, రెండున్నర లీటర్ల పాలు, 25 కోడిగుడ్లను అందిస్తున్నారు. 3–6 సంవత్సరాలలోపు పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల్లోనే పౌష్టికాహారాన్ని వండి పెడుతున్నారు.

పోషణ కిట్లతో అధిక ప్రయోజనాలు



అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రతినెలా సంపూర్ణ పోషణకిట్లను సక్రమంగా అందిస్తున్నారు. వీటితోపాటు పాలు, గుడ్లు కూడా ఇస్తున్నారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల నా ఆరోగ్యం మెరుగు పడింది. ఈ కిట్లు గర్భిణులకు ఎంతో ఉపయోగకరం. దీనిని బాలింతలు కూడా సద్వినియోగం చేసుకుంటున్నారు.- వద్దె సువర్ణ, గర్భిణీ, ఎర్రముక్కపల్లె, కడప

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణకిట్లను అందజేస్తోంది. వీటి వినియోగంపై అంగన్వాడీ కేంద్రాలలో పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. లబ్ధిదారులందరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలి.

- సునంద, సీడీపీఓ, కడప అర్బన్